ఈనాడు జగిత్యాల

గురువారం అక్టోబరు 17, 2024 7

ఏటా వర్షాకాలంలో వరద వస్తే గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరమైతే చుట్టూ తిరిగి పోవాల్సిందే. లోతు ఎక్కువగా ఉండడంతో వరద దాటికి వాహనాలతో పాటు కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో లోలెవల్ కల్వర్టుల సైడ్‌బర్మ్స్, రెయిలింగ్ కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. మరమ్మతు చేపట్టకపోవడం వాహనదారుల పాలిట శాపంలా మారింది. పైవంతెన నిర్మాణాలకు అధికారులు ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కావడం లేదు. నిధులు మంజూరైన చోట గుత్తేదారు పనులు చేపట్టడం లేదు. జిల్లాలో ప్రమాదకర వంతెనలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.. - న్యూస్‌టుడే, మల్లాపూర్

1. ఏ వాగుపై ఉంది
2. ఏ గ్రామాల మధ్య ఉంది
3. రోజుకు ఎన్ని వాహనాలు వెళ్తుంటాయి
4. వంతెన ఎన్నేళ్ల కింద నిర్మించారు
5. ప్రస్తుత పరిస్థితి



30 ఏళ్ల కిందట నిర్మించినా..

1. రాయికల్ పెద్దచెరువు కాల్వపై
2. రాయికల్-ఇటిక్యాల గ్రామాల మధ్య
3. నిత్యం 800కి పైగా వాహనాలు
4. 30 ఏళ్ల కిందట నిర్మించారు
5. వంతెల లోతట్టుగా ఉండటంతో ఏటా వర్షాకాలంలో నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తుండటంతో ఇరు గ్రామాలతో పాటు మల్లాపూర్-జగిత్యాల మార్గంలో వాహనాలు నిలిచిపోతున్నాయి. వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - రాయికల్

నిధుల్లేవ్.. మరమ్మతుల్లేవ్!



రాకపోకలు బంద్

1. ఫకీర్ కొండాపూర్ శివారులో ప్రధాన రహదారిపై
2. ఫకీర్ కొండాపూర్-యామాపూర్ గ్రామాల మధ్య
3. సుమారు రెండు వందలకు పైగా
4. సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించారు
5. లోలెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు నిలిచి పోయాయి. వాహనాల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి భారీ వర్షాలు కురిసిన సమయంలో కొట్టుకు పోయింది. ఈ వర్షాకాలంలో ఏకంగా 6 సార్లు తాత్కాలిక దారి కొట్టుకుపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– ఇబ్రహీంపట్నం



రెయిలింగ్ లేక ఇబ్బందులు

1. పెద్దవాగుపై 2. రేగుంట-ఇటిక్యాల
3. నిత్యం 800కు పైగా వాహనాలు వెళ్తుంటాయి
4. 32 ఏళ్ల కిందట నిర్మించారు
5. ప్రస్తుత వంతెనపై ఉన్న రెయిలింగ్ రెండేళ్ల కిందట కురిసిన వరదలకు కొట్టుకుపోయింది. వంతెనకు ఓ భాగంలో గండి పడింది. జాతీయ రహదారి పరిధిలో ఉన్న వంతెనను పట్టించుకోకపోవడంతో వాహనదారులు భయం భయంగా వెళ్తున్నారు. - మల్లాపూర్

పరి-శీలన



రక్షణ లేని కల్వర్టులు

1. బతుకమ్మ ఒర్రెపై 2. అంబారిపేట-ఎండపల్లి
3. 140 వరకు వాహనాలు వెళ్తుంటాయి
4. 50 ఏళ్ల కిందట నిర్మించారు
5. వెల్గటూరు, ఎండపల్లి మండలాల్లో పలు చోట్ల కల్వర్టులకు ఇరువైపులా రక్షణ గోడ, రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఏడో నంబరు రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న అంబారిపేట బస్‌స్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో బతుకమ్మ ఘాట్ వద్ద ఒర్రెపై కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. - వెల్గటూర్

శిథిలావస్థలో లోలెవల్ వంతెన

1. సూరంపేట వాగుపై 2. సూరంపేట-కోనాపూర్
3. 100కు పైగా 4. 60 ఏళ్ల కిందట నిర్మించారు
5. కొడిమ్యాల మండలం సూరంపేట రోడ్డు నుంచి కోనాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఏళ్ల కిందట నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. వర్షం పడిన ప్రతిసారి వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో గ్రామంలోకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో గ్రామస్థులు వరద తగ్గే వరకు గ్రామంలోని ఉండాల్సిన పరిస్థితి. - కొడిమ్యాల



టెండర్ పూర్తయినా..

1. మాటు కాలువపై
2. ఏఎస్ఆర్ తండా నుంచి ఇతర గ్రామాలకు
3. 100కు పైగా వాహనాలు వెళ్తుంటాయి
4. 30ఏళ్లకు పైగా
5. కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గతంలో కురిసిన వర్షాలకు పైన స్లాబు కొట్టుకు పోగా ఇటీవల కురిసిన వర్షాలకు చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. దీంతో తాత్కాలికంగా మట్టిని పోసి రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణానికి రూ.81 లక్షలు మంజూరై టెండర్ పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు.

- న్యూస్‌టుడే, మెట్‌పల్లి



రూ.10 కోట్లతో ప్రతిపాదనలు

1. కల్లూర్ వాగుపై
2. కల్లూర్-పైడిమడుగు గ్రామాల మధ్య
3. నిత్యం 520కు పైగా..
4. 25 ఏళ్ల కిందట నిర్మించారు
5. భారీ వరదలకు మూడు సార్లు కోతలకు గురైంది. తాత్కాలికంగా మొరం పోసి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరదలు వచ్చినప్పుడల్లా వారం రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతాయి. కొత్త వంతెన నిర్మాణం కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. - కోరుట్ల



అడవుల పరిరక్షణకు చర్యలు

జిల్లా అటవీశాఖ అధికారి ఎం.రవిప్రసాద్



జగిత్యాల జిల్లాలో అధికంగా ఉన్న అడవుల్లో పచ్చదనం పెంపుతోపాటు విలువైన అటవీసంపద పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అటవీ శాఖ జిల్లా అధికారి ఎం.రవిప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో ఏకో టూరిజం, అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు 'న్యూస్‌టుడే' 'ముఖాముఖి' ద్వారా వివరించారు.

- న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

ముఖాముఖి

? ప్రశ్న: అటవీ విస్తీర్ణం పెంపునకు తీసుకుంటున్న చర్యలు?

✓ **సమాధానం:** జిల్లాలో 53,734 హెక్టార్ల అటవీభూమి ఉండగా 23 శాతం ఉన్న అడవులను 33 శాతానికి చేర్చేలా చర్యలు చేపట్టాం. అటవీ పునరుజ్జీవన పథకాన్ని అమలు చేస్తున్నాం. మొక్కలు నాటడం, కొమ్మలుకొట్టడం, నూతన ప్లాంటేషన్ చేపడుతున్నాం.

? ఆక్రమిత అటవీ భూముల రక్షణకు తీసుకుంటున్న చర్యలు.

✓ జిల్లాలో గతంలో 421 మంది గిరిజనులు 796 ఎకరాలకు పట్టాలు పొందగా మిగిలినవారు అధికంగానే దరఖాస్తు చేసినా ప్రభుత్వం పరిగణించలేదు. దాదాపుగా 8 వేల ఎకరాల వరకు అటవీభూమి ఇతరుల ఆక్రమణలో ఉండగా స్వాధీనానికి, రెవెన్యూ సరిహద్దులను తేల్చేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వాధీన భూమిలో ప్లాంటేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బందికి ఆయుధాలివ్వటంపై ప్రభుత్వం యోచిస్తోంది.

? రోళ్లవాగు ప్రాజెక్టుకు సంబంధించి అటవీ శాఖకు భూమి బదలాయింపు ఎక్కడి వరకు వచ్చింది?

✓ రోళ్లవాగు తిరుగు జలాల్లో 325 ఎకరాల అటవీభూమి ముంపునకు గురవుతోంది. గొల్లపల్లి, పెగడపల్లి మండలాల్లో ఇంతే సమానంగా రెవెన్యూ భూమిని అటవీశాఖకు ఇస్తున్నారు. 40 వేల వరకు చెట్లు కోల్పోతుండగా నూతన భూమిలో 3.50 లక్షల మొక్కలు నాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతితో వచ్చే జూన్ వరకు రోళ్లవాగులో నీటినిల్వకు అవకాశముంది.

? సిబ్బంది నియామకం, కలప అక్రమ రవాణా కట్టడి ఎలా.

✓ జిల్లాలోని 5 రేంజిలకు అధికారులుండగా 26 సెక్షన్లు, 76 బీట్ల పరిధిలో 102 మందికిగాను 50 శాతం వరకే అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అయినా నిఘా లోపం తలెత్తకుండా చూస్తున్నాం. ప్రభుత్వం త్వరలోనే సిబ్బంది నియామకం చేపట్టనుంది. జిల్లాలో చెట్లను నరకడం, ఇతర జిల్లాల నుంచి టేకు కలప రవాణా చాలావరకు తగ్గింది. ఆకురాలి వాటిల్లే అగ్నిప్రమాదాలను నియంత్రిస్తున్నాం.

? వన్యప్రాణుల రక్షణకు ఏయే చర్యలు తీసుకుంటున్నారు.

✓ అటవీ జంతువుల నీటి కోసం 260 వరకు సాసర్‌పిట్స్ ఉండగా వీటిల్లో చలికాలం నుంచి వేసవి వరకు నీరు నింపుతున్నాం. సోలార్ బోర్ల ద్వారా అడవుల్లో నీటిని తోడి వన్యప్రాణులకు అందుబాటులో ఉంచుతున్నాం. 45 చెక్‌డ్యాంలు, 115 నీటికుంటల ద్వారా వన్యప్రాణుల దాహార్తి తీరుతోంది. అడవుల్లో చిరుతలు, జింకలు, నెమళ్లు, కొండగొర్రెలు, మనుపోతులు, తోడేళ్లు, పందులు, ముళ్లపందులు, కుందేళ్లు తదితర వన్యప్రాణులుండగా వేటగాళ్లపై కఠిన చర్యలతో ఇటీవల వేట తగ్గింది.

? కొత్త ప్రాజెక్టులు ఏమైనా చేపడుతున్నారా?

✓ కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాలు, సారంగాపూర్ అటవీప్రాంతం, రోళ్లవాగు ప్రాజెక్టులను కలుపుతూ ఏకో టూరిజంకు ప్రతిపాదించాం. జగిత్యాల మండలం అంబారిపేటలో 125 ఎకరాల అటవీభూమిలో రూ.2 కోట్ల వ్యయంతో అర్బన్ ఫారెస్ట్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం. వాచ్‌టవర్, సెల్ఫీపాయింట్, కుంట, ట్రెక్కింగ్ తదితరాలతో పట్టణవాసులు వచ్చి సేద దీరే ఏర్పాట్లుంటాయి. కొండగట్టు, ధర్మపురిలోనూ అర్బన్‌పార్కులను ఏర్పాటు చేస్తాం.

రహదారి పరిశీలన

సారంగాపూర్, న్యూస్‌టుడే: నిర్మాణంలో భాగంగా అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన రహదారిని కేంద్ర అటవీశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కైలాశ్ భీంరావ్ బిశ్వాస్ బుధవారం పరిశీలించారు. సారంగాపూర్ మండలంలోని రేచపల్లి మ్యాడారం తండా నుంచి రాయికల్ మండలం తాట్లవాయి మధ్య నాలుగు కి.మీ పొడవునా అటవీ ప్రాంతం ఉండడంతో గతంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రహదారి నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేశారు. ఇప్పటికే స్టేజ్-1 కింద కేంద్రం అనుమతించగా, స్టేజ్-2 అనుమతి కోసం కేంద్ర అటవీశాఖ అధికారి బుధవారం జిల్లా అటవీ అధికారులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఇందులో భాగంగా రహదారి నిర్మాణంలో అటవీ శాఖ భూమి, చెట్లు నష్టంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఎఫ్‌వో రవిప్రసాద్, రేంజర్ పద్మారావు, డీఆర్‌వో రవికుమార్, బీట్ అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న కేంద్ర అటవీశాఖ అధికారి కైలాశ్ భీంరావ్

24 గంటలు.. 25 ప్రసవాలు

జగిత్యాల మాతాశిశు కేంద్రం ఘనత

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల మాతాశిశు కేంద్రంలో 24 గంటల్లో 25 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించింది. రెండేళ్ల కిందట ప్రారంభమైన మాతాశిశుకేంద్రంలో 79 వైద్యులుండగా అందులో 10 మంది గైనకాలజిస్టులున్నారు. ప్రతిరోజు సుమారు 200 మంది గర్భిణులు పరీక్షల కోసం వస్తుండగా ప్రతినెల సుమారు 300 నుంచి 400 ప్రసవాలు జరుగుతున్నాయి. గత 24 గంటల్లో జరిగిన 25 ప్రసవాల్లో 13 శస్త్ర చికిత్సలు కాగా 12 సాధారణ ప్రసవాలున్నాయి. తల్లీపిల్లలందరూ ఆరోగ్యంగా ఉన్నారు. మాతాశిశుకేంద్రంలో జరిగే ప్రసవాల్లో 60 శాతం శస్త్ర చికిత్సలు జరుగుతుండగా 40 శాతం సాధారణ ప్రసవాలుంటున్నాయి. ప్రసవాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య 65 శాతానికి పెరిగిందని జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు ఆశావర్కర్, ఏఎన్ఎంకు సమాచారం ఇస్తే మండల కోఆర్డినేటర్ 102 వాహనం పంపిస్తారని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తామని జైపాల్‌రెడ్డి తెలిపారు.



ఆసుపత్రిలో శిశువులు

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా జరుగుతుందని హౌజింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం జిల్లా అధికారులతో దృశ్య సమీక్ష నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ ఉంటారని ప్రతి గ్రామంలో ప్రజాపాలన ద్వారా వచ్చిన ఇందిరమ్మ దరఖాస్తుల గ్రామసర్వేయర్‌గా పంచాయతీ కార్యదర్శులను నియమించాలన్నారు. దరఖాస్తుల్లో ప్రత్యేక సాఫ్ట్ ద్వారా అర్హులను గుర్తించి ఎంపీడీవోల ద్వారా మండల లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. నియోజకవర్గాలు, కులాల వారీగా జిల్లా కోఆర్డినేటర్ పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ ఇళ్లు మంజూరు చేస్తారని ఈశ్వరయ్య అన్నారు. కలెక్టరేట్ నుంచి సమీక్షలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఈఈ రాజేశ్వర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



దృశ్య సమీక్షలో అదనపు కలెక్టర్

న్యూస్‌టుడే– కరీంనగర్ విద్యావిభాగం

మీపై గురుతర బాధ్యత!

- విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు
- సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయాలి



ఉమ్మడి జిల్లాలో..

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు..:	2,465
విద్యార్థులు :	1,65,691
పని చేస్తున్న ఉపాధ్యాయులు :	10,078
కొత్తగా నియమితులైనవారు :	692

డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు.. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు.. ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మీరు.. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు మార్గదర్శకులు కావాలి.. సర్కారు బడుల బలోపేతానికి.. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందడానికి మీ వంతు కృషి చేయాలి.. నిత్యం పాలనా విధులతో తీరిక లేకుండా ఉండే నాలుగు జిల్లాల కలెక్టర్లు విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మీరు ఈ క్రతువులో భాగస్వాములు కావాలి.. ప్రభుత్వ పాఠశాలలు మరింత మెరుగవడానికి మీరు చొరవ చూపాలి..

బడి బాట పట్టేలా..

చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాలో బడి బయట బాలలు 1,185 మంది ఉన్నట్లు గుర్తించారు. చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వలస కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.

బోధనలో నూతన ఒరవడి

ప్రపంచం వేగంగా మారిపోతోంది.. కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే ఈ పోటీలో దూసుకెళ్తున్నారు.. మీ పరిధి విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారు. బడుల్లో కృత్యాధార బోధనను అమలు చేస్తున్నా పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశామా.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంత వరకు అర్థం చేసుకున్నారు. వారు ఏం నేర్చుకున్నారనేదానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. చెప్పడం కంటే చూసి నేర్చుకుంటే విద్యార్థులు మరిచిపోరు. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగించాలి.



గంగాధర మండలం కురిక్యాల ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు బాలలకు బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయురాలు

మంచి అలవాట్లు నేర్పించండి..

స్మార్ట్‌ఫోన్‌లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణులకు బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడానికే పరిమితం చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరవాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారవుతారు.

భరోసానివ్వండి..

మీ బడిలో చదివే విద్యార్థులకు మీరున్నారన్న భరోసానివ్వండి. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెస్తున్న కొందరు గురువులు.. తోటి విద్యార్థులు బాలికలను వేధిస్తున్న ఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి.. ఎవరినైనా ఇలా వేధిస్తే వెంటనే మీకు చెప్పేలా ధైర్యం చెబితే వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు పంచుకుంటారు. అప్పుడు ఇలాంటి వేధింపులను మొదట్లోనే తుంచివేయొచ్చు. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైనా దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తిని పరిపూర్ణత తెచ్చినవారు అవుతారు.

రహదారుల నిర్మాణాలకు నిధుల మంజూరు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల నియోజకవర్గంలో 14 రహదారుల నిర్మాణాలకు సీఆర్ఆర్ గ్రాంటు కింద పంచాయతీరాజ్ రహదారుల విభాగం ద్వారా రూ.15 కోట్లు మంజూరైనట్లు శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలంలో అంబారిపేట-తాటిపల్లి రహదారి కల్వర్టుకు రూ.50 లక్షలు, అంబారిపేట-అంతర్గాం రహదారికి రూ.48.06 లక్షలు, జగిత్యాల రూరల్ మండలంలో చర్లపల్లి-కండ్లపల్లి రహదారి కల్వర్టుకు రూ.50 లక్షలు, హైదర్‌పల్లి-బాలపల్లి రహదారికి రూ.24 లక్షలు, బీర్‌పూర్ మండలంలో మంగెళ-రంగసాగర్ రహదారికి రూ.3.65 కోట్లు, సారంగాపూర్ మండలంలో ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఒడ్డెరకాలనీ-రంగపేట రహదారికి రూ.64 లక్షలు, రంగపేట ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఆలూరు రహదారికి రూ.1.75 కోట్లు, అర్పపల్లి ఆర్ అండ్‌బీ రహదారి నుంచి శ్మశానవాటిక మీదుగా వ్యవసాయ భూములకు వెళ్లే రహదారికి రూ.74 లక్షలు, మోహన్రావుపల్లి నుంచి వ్యవసాయ భూములకు వెళ్లే రహదారికి రూ.31.94 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. రాయికల్ మండలంలో కిష్టంపేట-చల్‌గల్ రహదారికి రూ.1.56 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారి నుంచి బషీర్‌పల్లికి రూ.68 లక్షలు, ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఇటిక్యాల మోడల్ స్కూల్ రూ.64 లక్షలు, అల్లీపూర్ నుంచి ఎల్లమ్మ గుడి మీదుగా శ్రీరాంనగర్ రహదారికి రూ.1.54 కోట్లు, చెర్లకొండాపూర్ నుంచి మైతాపూర్ వెళ్లే రహదారికి రూ.1.86 కోట్లు మంజూరయ్యాయని వీటి ద్వారా 18.48 కి.మీ రహదారుల నిర్మాణం జరుగుతుందని వివరించారు. నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కోరుట్ల నియోజకవర్గంలో..

కోరుట్ల: అయిదు వంతెనల నిర్మాణాలకు రూ.14.30 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ బుధవారం తెలిపారు. ఏఖీన్‌పూర్-సంగెం వంతెనకు రూ.1.50 కోట్లు, కోరుట్ల జంబిగద్దె-సంగెం వంతెనకు రూ.3.80 కోట్లు, మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్-రామారావుపల్లె లోలెవల్ వంతెనకు రూ.2.80 కోట్లు, కొండ్రికర్ల-కొనరావుపేట వంతెనకు రూ.4 కోట్లు, మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్-ఒడ్డెర కాలనీ వంతెనకు రూ.2.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

కొండగట్టు ఆలయానికి విజయ డెయిరీ నెయ్యి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బుధవారం విజయ డెయిరీ నెయ్యి డబ్బాలు సరఫరా కాగా ఈవో పరిశీలించారు. మొత్తం 57 టిన్నులు రాగా ఒక్కో టిన్నులో 35 కిలోల నెయ్యి ఉన్నట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొనడంతో తూకం వేయించారు. మొత్తం 1995 కిలోల నెయ్యి సరఫరా చేశారని పన్నులతో కిలోకు రూ.609 ఉందని ఈవో తెలిపారు.

■ ఆలయ పరిసరాల్లో భక్తులు మలమూత్ర విసర్జన చేయకుండా ఉండేందుకు 8 మంది సెక్యూరిటీ, హోంగార్డులకు బాధ్యతలు అప్పగించినట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. శౌచాలయాలను వినియోగించుకునేలా ప్రత్యేక నిఘా వేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలను తిరిగి సిబ్బందికి సూచనలు చేశారు.



నెయ్యిని పరిశీలిస్తున్న ఈవో రామకృష్ణారావు

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)

జగిత్యాల 94400 23123

కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

సమస్య: జగిత్యాల పొలాస్‌క్రాస్ నుంచి ధర్మపురి రోడ్డులో అసంపూర్తి సెంట్రల్‌లైటింగ్ పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయి, పనులను పూర్తి చేయరా.? - **సురేందర్, విజయపురి**

సమాధానం: విద్యుత్ స్తంభాల దిమ్మెలు, డివైడర్ పనులు మధ్యలోనే నిలిచిపోగా జాతీయ రహదారులశాఖ అధికారులకు సమస్యను వివరించి పనులను పూర్తిచేయాలని కోరాం. - **సమ్మయ్య, పురపాలక కమిషనర్**

న్యూస్‌టుడే, మల్యాల

సమస్య: తక్కళ్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో బోరింగు పనిచేయడం లేదు. మరమ్మతు చేయించాలి. - **కాలనీవాసులు**

సమాధానం: మెకానిక్‌ను పంపించి బోరింగు మరమ్మతు చేయిస్తాం. - **స్వాతి, ఎంపీడీవో, మల్యాల**

మహాసభ కరపత్రం ఆవిష్కరణ

కోరుట్ల, న్యూస్‌టుడే: బీడీ పరిశ్రమలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఈనెల 26న జగిత్యాలలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు పేర్కొన్నారు. బుధవారం కోరుట్ల సి.హెచ్.ప్రభాకర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రాష్ట్ర నాయకులు బాలరాజు, గోవర్ధన్ హాజరు కానున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షులు కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, ఏడీ మల్లం, ఎండీ మౌలానా, ఎన్నం రాధ, వడ్ల భాగమ్మ, ఎన్నం రాజాగంగు, ఎండీ సమీర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులను కలిశారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6లోపు ఓటు నమోదు చేసుకొని మద్దతు తెలపాలని కోరారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా వేదికపైకి తీసుకువచ్చారు. భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం జరిపించారు. మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి, మాజీసర్పంచి పోతు సింధూజ, అర్చకులు మాధవచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

గోద్రెజ్ ఉత్పత్తుల విక్రయం ప్రారంభం



జగిత్యాలలో ప్రారంభిస్తున్న పురపాలక అధ్యక్షురాలు జ్యోతి

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాలలోని యశస్వి ఎలక్ట్రానిక్స్‌లో గోద్రెజ్ కంపెనీ కొత్తగా మార్కెట్లోకి ప్రవేశపెట్టిన రేగాలిస్ డబుల్‌డోర్ రిఫ్రిజిరేటర్ విక్రయాలను పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి ప్రారంభించారు. కంపెనీ తెలంగాణ ప్రాంత ముఖ్యులు హితేజ్ భరద్వాజ, సేల్స్ మేనేజర్ నాగరాజు, యశస్వి ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి యశస్వి, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

జిల్లాకు ఏడుగురు ఏవోల కేటాయింపు

జగిత్యాల ధరూర్‌క్యాంపు : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా ఎంపికైన ఏడుగురు వ్యవసాయాధికారులను జగిత్యాల జిల్లాకు కేటాయించగా బుధవారం నియామక పత్రాలను అందించి విధుల్లో చేరినట్లు జిల్లా వ్యవసాయాధికారి సీహెచ్.రాంచందర్ తెలిపారు. సారంగాపూర్ మండల వ్యవసాయాధికారిగా ప్రదీప్‌రెడ్డి, వెల్గటూరుకు సాయికిరణ్, ఎండపల్లికి మహేశ్, ధర్మపురికి సింధూజ, బుగ్గారంనకు అక్షిత, పెగడపల్లి మండల ఏవోగా శ్రీకాంత్, డీఏవో కార్యాలయ టెక్నికల్ ఏవోగా దీప్తి నియమితులైనట్లు వివరించారు.

18న విద్యుత్తు పరిష్కార వేదిక

ధర్మపురి: పట్టణంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఈ నెల 18న విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఆ శాఖ డివిజన్ ఇంజినీర్ రాజిరెడ్డి పేర్కొన్నారు. ధర్మపురి, వెల్గటూర్ తదితర ప్రాంతాల వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ వేదిక నిర్వహిస్తామని తెలిపారు.

స్వాగత తోరణం ప్రారంభం

ధర్మపురి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీలో బుధవారం దాతల విరాళాలు రూ.6.50 లక్షలతో నిర్మించిన నూతన శ్రీ రామాలయ స్వాగత తోరణాన్ని ముకుందానంద స్వామిజీ ప్రారంభించారు. పుర అధ్యక్షురాలు సత్తెమ్మ, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలన

గొల్లపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పరిశీలించింది. దట్నూర్, చిల్వాకోడూర్‌లోని వైకుంఠ ధామం, అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్టు షెడ్డు, పంచాయతీ భవనాలను పరిశీలించారు. ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి కరుణ, ఏపీఎం త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మానాల అటవీ ప్రాంతంలో టేకు చెట్ల నరికివేత



తరలించేందుకు సిద్ధంగా టేకు కలప

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలం మానాల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో టేకు చెట్లను కలప స్మగ్లర్లు యథేచ్ఛగా నరికివేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. కొందరు యంత్రాలతో టేకు చెట్లను కోసి తీసుకొని వెళ్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అటవీ అధికారుల పర్యవేక్షణలేక పోవడంవల్ల అక్రమ కలప రవాణాతోపాటు తరచూ వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి మానాల టేకువనంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వద్దంటే వినరే!

మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై మొక్కజొన్న, వరి పంటలను ఆర బెడుతుండటంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా రైతులు పట్టించుకోవడంలేదు. రెండు సంవత్సరాల వ్యవధిలోనే ఇద్దరూ మృతిచెందగా పది మందికి పైగా గాయపడ్డారు. ఇరవై రోజుల కిందట కుస్తాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోయి సిమెంట్ లారీ బోల్తాపడ్డ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. వారం రోజుల కిందట ధర్మారం శివారులో ఒకవైపు మక్క కంకులు ఉండటంతో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు స్పందించి రహదారులపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మల్లాపూర్**

రహదారులను కప్పేస్తున్నాయి..

కోరుట్ల, న్యూస్‌టుడే: జాతీయ, గ్రామీణ ప్రాంతాల రహదారులు కుంచించుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెట్లను ఏళ్ల తరబడి చదును చేయకపోవడంతో కప్పేస్తున్నాయి. హరితహారంలో ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోడ్లపైకి వంగి రహదారులను ఆక్రమిస్తున్నాయి. కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఫీజు బకాయిల విడుదల కోరుతూ నిరసన



జగిత్యాలలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లాలోని డిగ్రీ కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది బుధవారం జగిత్యాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. 3 సంవత్సరాలుగా రీయింబర్స్‌మెంట్ నిధులు రానందున కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. శ్రీపాద నరేశ్, పోతని ప్రవీణ్, మూర్తి, ఆంజనేయులు, ముసిపట్ల రాజేందర్, ప్రకాశ్, రాజేందర్, మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్, నరేశ్, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని..



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న యువకులు

సారంగాపూర్: పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారంటూ యువకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం బీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, తాగునీటి వసతులు లేవని, మధ్యాహ్న భోజనంలోనూ సమస్యలు నెలకొన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు వసతులు కల్పించేలా చూస్తానని యువకులకు హామీచ్చారు. కాల్వ హరీష్, మహేష్, సతీష్, మహేష్, అరుణ్, దీపక్, శివ, వంశీ, రాము, కార్తీక్, మనోజ్, వినయ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



నేరాల్లో యువత

పరస్పర దాడులు.. హత్యలు



న్యూస్‌టుడే, కోరుట్ల

యువత మద్యానికి బానిసై పెడదారిలో వెళ్తూ తల్లిదండ్రులు ఆశలను వమ్ము చేస్తున్నారు. విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మద్యం, గంజాయి మత్తుకు అలవాటు పడిన యువకులు నేరాల ఊబిలో చిక్కుకొంటున్నారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోతుండగా హత్యకు పాల్పడ వారు జైలు పాలవుతున్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పోలీస్ సర్కిళ్ల పరిధిలో రెండేళ్లుగా జరిగిన హత్యలు, దాడుల ఘటనలను పరిశీలిస్తే బాధితులు, నేరాలకు పాల్పడ్డ వారు యువకులే ఉండటం ఇందుకు నిదర్శనం.

కోరుట్ల, మెట్‌పల్లి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా గొలుసు మద్యం దుకాణాలు వెలిశాయి. అర్ధరాత్రిళ్లు యువకులు మద్యం తాగడంతోపాటు అకారణంగా రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. మద్యం మత్తులో గొడవలు, ఘర్షణలకు దిగుతున్నారు. అదే మత్తులో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. గతంలో నేరాలు జరిగిన సమయంలో కొంతకాలం అర్ధరాత్రి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చేవారు. ప్రస్తుతం యువకులు నిత్యం ఆరుబయట, జన నివాస, శివారు ప్రాంతాల్లో విచ్చలవిడిగా రాత్రిళ్లు మద్యం తాగుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి అమ్మకాలు పెరిగిపోయాయి. గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ వారిలో యువకులు, మైనర్లు ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలకు మాత్రమే పరిమితి కావడం పట్టుబడ్డ వారికి నామమాత్రపు జరిమానా విధించి విడిచి పెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

- కోరుట్ల పట్టణంలో గతేడాది ఏప్రిల్‌లో ఓ పార్టీకి చెందిన వ్యక్తి వివాహేతర సంబంధంపై అనుమానంతో రాత్రి అందరు చూస్తుండగానే పలువురు యువకులు చికతబాది రాళ్లతో దాడిచేయడంతో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు.
- కోరుట్లలో గతేడాది ఆగస్టులో అప్పటి అధికార పార్టీ కౌన్సిలర్ భర్తను రౌడీషీటర్ బృందం ఉదయం 9 గంటల ప్రాంతంలో పట్టణంలోని నడిబొడ్డునున్న టీకొట్టు వద్ద అందరూ చూస్తుండగానే కత్తితో దాడిచేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు.
- మెట్‌పల్లి పట్టణంలో గతేడాది ఆగస్టులో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు.
- కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు గతేడాది ఆగస్టులో మెట్‌పల్లిలో హత్యకు గురయ్యాడు.
- ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో దారిదోపిడీకి యత్నించి యువకులు పట్టుబడ్డారు.
- కోరుట్ల పట్టణంలో స్నేహితులైన పలువురు యువకులు సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో గొడవకు దిగారు. గతంలో జరిగిన గొడవలను మనసులో పెట్టుకొని ఓ యువకుడి మెడపై కత్తితో దాడిచేసి హత్య చేశారు.

జిల్లా స్థాయి కళోత్సవ్

జగిత్యాల ధరూర్‌క్యాంపు: సమగ్రశిక్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలోని టీచర్స్ భవన్‌లో జిల్లాస్థాయి కళోత్సవ్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొని వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్ తదితర సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. మొదటి స్థానం పొందిన విద్యార్థులు నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయి కళోత్సవ్‌లో పాల్గొంటారని జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ తెలిపారు. అనుపమ, మహేశ్, రాజేంద్రప్రసాద్, సతీష్, లక్ష్మణ్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



కళోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా కోజాగర ఉత్సవాలు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి కోజాగర పౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా.. దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులచే భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాలల్లో చంద్రబింబాన్ని ప్రదర్శించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీటి నిలిపివేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను బుధవారం సాయంత్రం నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 11,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా కాకతీయ కాలువకు 5,800, ఎస్కేప్ గేట్లద్వారా గోదావరిలోకి 1,200, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిరికొండకు చెందిన పెద్దలు జయ్య(56) స్థానికంగా సెలూన్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం టీకొట్టు వద్దకు వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కోరుట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

క్రైం కార్నర్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణ శివారులో వట్టివాగు వంతెన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నీలం ప్రవీణ్ కూతురు హిమశ్రీతో కలిసి మెట్‌పల్లికి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మెట్‌పల్లి నుంచి జగిత్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ వట్టివాగు వద్ద ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి ఒక్కసారిగా కుడివైపుకు తిప్పారు. దీంతో బస్సు, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వాహనంపై ఉన్న తండ్రి, కూతురుకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో ఇరువురిని నిజామాబాద్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

ధర్మపురి గ్రామీణం: రామయ్యపల్లెకు చెందిన బూరుగు రాజన్నను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రాజన్న రామయ్యపల్లె బస్టాండ్ వద్ద నిలబడగా.. రాయపట్నం వైపు నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. బాధితుడి కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



బస్సు కింది భాగంలో ఊడిన రాడ్

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం ఆల్లీపూర్ గ్రామ శివారులో ఆర్టీసీ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల వైపు వెళుతుండగా బస్సు కింది భాగంలోని రాడ్ ఊడిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో 53 మంది ప్రయాణికులుండగా అందరు సురక్షితంగా ఉన్నారు.

దూసుకెళ్లిన కారు..

గొల్లపల్లి: స్థానిక నల్లగుట్ట వద్ద బుధవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం హైదరాబాద్‌కు చెందిన నలుగురు మిత్రులు వ్యాపార నిమిత్తం కారులో పెద్దపల్లికి, అక్కడి నుంచి జగిత్యాల వైపు వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు నల్లగుట్ట మూలమలుపు వద్ద అదుపుతప్పి పల్టీలు కొడుతూ పొలంలోకి దూసుకెళ్లింది. ఎవరికి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

రోళ్లవాగు ముంపు చెట్ల లెక్కింపు



చెట్టు కొలత తీస్తున్న కూలీలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా ముంపునకు గురవుతున్న అటవీ భూమిలో ఉన్న చెట్లను ఇరిగేషన్ అధికారులు లెక్కిస్తున్నారు. ఆధునికీకరణలో భాగంగా నీటినిల్వను 0.25 టీఎంసీ నుంచి టీఎంసీకి పెంచడంతో ముంపునకు గురవుతున్న అటవీ భూమిలో ఉన్న చెట్లు, వాటి కొలతలను లెక్కిస్తున్నారు. అనంతరం ఏమేర చెట్లు అటవీ ప్రాంతంలో ఉన్నాయో గుర్తించి అటవీశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేయనున్నట్లు డీఈఈ చక్రునాయక్ తెలిపారు.

దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: హైదరాబాద్ మోండామార్కెట్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసానికి నిరసనగా జగిత్యాలలో జయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. లక్ష్మీనారాయణ, నలువల శ్రీకాంత్, దాసరి దామోదర్, సిరికొండ సింగరావు, బిట్టు, కార్తీక్, సాయిచరణ్‌రావు, నిఖిల్‌రావు, చిట్ల సాయి, నిఖిల్‌రెడ్డి, గణేశ్, సాయిభూషణ్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

బీటుకు భారీగా మక్కలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు బుధవారం పెద్దఎత్తున మక్కలను విక్రయానికి తెచ్చారు. 1,758 క్వింటాళ్ల మక్కలను రైతులు విక్రయించగా బీటులో క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,820 నుంచి గరిష్ఠంగా రూ.2,381 వరకు ధర పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ-1010 రకం ధాన్యానికి రూ.1,878 నుంచి రూ.1,881 చొప్పున ధర లభించినట్లు వివరించారు. మక్కలకు ప్రభుత్వ మద్దతుధర క్వింటాలుకు రూ.2,225 ఉండగా బీటులో ఇంతకన్నా అధికంగానే ధరలు పలుకుతున్నాయి.

మూఢనమ్మకాలను వీడాలి

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బాజోజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బడె శ్రీనివాస్, తులసి ఆగమయ్య పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం సాయంత్రం జగిత్యాలలో నిర్వహించి మేడిపల్లి మండలం కట్లకుంటలో మంత్రగాళ్లను చంపుతామని పేర్కొంటూ పోస్టర్లు వేయటాన్ని ఖండించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు అర్హత

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాలలోని కేజీఆర్ హైస్కూలు 8వ తరగతి విద్యార్థిని కందుకూరి తపస్వి గతనెలలో జరిగిన ఇండియన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో మెరుగైన ప్రతిభతో ఉమ్మడి జిల్లా నుంచి రీజనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

అమరవీరుల సంస్మరణ వాలీబాల్ టోర్నీ

మేడిపల్లి: కోరుట్ల వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు అమరవీరుల సంస్మరణార్థం మేడిపల్లి, కోరుట్ల, కథలాపూర్ మండలాల క్రీడాకారులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.బారి తెలిపారు. కోరుట్ల సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రాయికల్: కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఆలూరు పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని పాడి రైతులకు ఒక సంవత్సరపు బోనస్ రూ.37,980ను 90 మంది రైతులకు బుధవారం పంపిణీ చేశారు.

సంఘాలు-కార్యవర్గాలు

రాయికల్ పట్టణం: శివాజీ రైతు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం పట్టణంలోని శివాజీ రెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా కుర్మ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుర్మ నారాయణ, కోశాధికారి పటేల్ గోపాల్‌రెడ్డి కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

బీమారం: బీమారం మండల మాదిగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒడ్డాడు మాజీ సర్పంచి దువాస గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా చిలువేరి వెంకటేశ్, క్యాషియర్‌గా బంగారు దీపక్, ప్రచార కార్యదర్శిగా ఆరెదరి, కార్యదర్శి మకిలి కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం శశికుమార్, ఉపాధ్యక్షుడిగా తెడ్డు విజయ్, దువాస నారాయణ ఎన్నికయ్యారు.

అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోండి

రాయికల్ పట్టణం: నవంబర్ 2021 నాటికి డిగ్రీ పట్టా పొందిన వారు నవంబర్ 6 లోగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం సూచించారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తుతోపాటు ఒరిజినల్ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల అధికారిని సంప్రదించి నకలు ధ్రువీకరణ పత్రాలపై అటెస్టేషన్ చేయించుకోవాలన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్ పట్టణం: ఎల్ఆర్ఎస్‌లో భాగంగా రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు రుసుము చెల్లించిన రశీదు, ల్యాండ్ రిజిస్ట్రేషన్ పత్రాలతో పుర కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ కోరారు. నిర్ధారించిన రుసుములను చెల్లించి భూమిని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులను నియమించండి

ఇబ్రహీంపట్నం: ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం వెంటనే నియమించాలని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ విజయభాస్కర్ కోరారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం భోజన విరామ సమయంలో నిర్వహించారు.

సంక్షిప్తం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఠాణాను బుధవారం తనిఖీ చేశారు.

విద్యుత్తు డీఈకి సన్మానం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: బదిలీ అయిన మెట్‌పల్లి విద్యుత్తు డీఈ పి.తిరుపతిని పట్టణంలోని విద్యుత్తు కార్యాలయంలో 327 యూనియన్ జిల్లా నాయకుడు రాంజీనాయక్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. వేణుగోపాల్‌రెడ్డి, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రాయికల్ పట్టణం: రాయికల్ విద్యుత్తు ఉపకేంద్రం ఏఈగా తుమ్మల నవీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అయిదేళ్లుగా ఏఈగా పని చేసిన అర్జున్ మేడిపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం నుంచి తుమ్మల నవీన్ బదిలీపై వచ్చారు.

కోరుట్ల విద్యుత్తు ఏఏవోగా..

కోరుట్ల: కోరుట్ల విద్యుత్తు ఈఆర్‌వో కార్యాలయం ఏఏవోగా గోపు భూమయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఏవో వసంతరావు మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా, జగిత్యాల సర్కిల్ కార్యాలయంలో ఏఏవోగా పని చేసిన భూమయ్య కోరుట్లకు వచ్చారు. మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఏఏవోగా పని చేసిన టి.శంకర్ జగిత్యాల సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయినట్లు విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల డబుల్ బెడ్‌రూం సమీపంలో నూకపల్లి వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ సహాయ సంచాలకులు రమేశ్ ఒక ప్రకటలో కోరారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 99633 53830, 99630 50734లో సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

కోరుట్ల: కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వాహకులకు బుధవారం సెర్ప్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఏపీఎం నరహరి మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొత్తం 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీసీలు అంజయ్య, విజయనిర్మల, అశోక్, రాజు, నిర్వాహకులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లతో దంపతులు


ట్రాన్స్‌జెండర్‌తో యువకుడి వివాహం

గొల్లపల్లి, న్యూస్‌టుడే: గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన ట్రాన్స్‌జెండర్‌ను బుధవారం వివాహం చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు సదరు ట్రాన్స్‌జెండర్‌కు ఉన్న రెండేళ్ల పరిచయం ప్రేమగా మారినట్లు సమాచారం. ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన శ్రీనివాస్.. ఇటీవలే ఇంటికి వచ్చాడు. తన కుటుంబసభ్యులను ఒప్పించి ట్రాన్స్‌జెండర్ల సమక్షంలో బుధవారం వైభవంగా వివాహం చేసుకున్నాడు.

మత్తుతో బతుకులు చిత్తు!

గంజాయికి బానిసవుతున్న యువత

ఈనాడు, కరీంనగర్



■ కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి స్నేహితులతో కలిసి గంజాయికి అలవాటు పడ్డాడు. చేతి ఖర్చులకు రోజూ రూ.500 వరకు అడిగే పరిస్థితికి చేరాడు. కూలీనాలీ చేస్తూ కష్టపడే తల్లిదండ్రులు అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే సామగ్రిని ధ్వంసం చేయడంతోపాటు తల్లిదండ్రులపై చేయిచేసుకోవడం మొదలు పెట్టాడు. బంధువులు చొరవ తీసుకుని కరీంనగర్‌లోని ఓ మానసిక వైద్యుడి దగ్గర చికిత్స చేయిస్తున్నారు.

■ జగిత్యాల జిల్లాలో గంజాయికి బానిసైన యువకులు కొందరు ఓ బాలికకు అలవాటు చేశారు. మైకంలో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఏడాది కిందట సంచలనం రేకెత్తించింది.



2023లో	కేసులు	పట్టుబడ్డ గంజాయి (కిలోల్లో)	అరెస్టయినవారు
కరీంనగర్	22	27.608	45
పెద్దపల్లి	25	34.380	55
జగిత్యాల	13	91.540	36
సిరిసిల్ల	59	70.793	127

● కోడ్ భాష లేదా అమితంగా తెలిసిన వ్యక్తుల ద్వారానే వీటిని అమ్ముకున్న వారికి చాకచక్యంగా విక్రయిస్తున్నారు.

● చాక్లెట్ల రూపంలో వీటిని రహస్యంగా విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ఓ వైపు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా వినియోగం మాత్రం ఆగడం లేదు. గంజాయి మత్తులో జోగుతున్న యువత తమ ఆరోగ్యం దెబ్బతీసుకోవడంతోపాటు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పోలీసులు గుర్తిస్తున్నారు. గొడవలకు దిగడం, చోరీలకు పాల్పడటమే కాకుండా వేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. కొందరు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఏడాది వ్యవధిలో 200ల కిలోలకుపైగా గంజాయిని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్నారు. 100 మంది వరకు యువకులు, వారి కుటుంబీకులకు ఆయా ఠాణాల పరిధిలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు.

అక్రమ రవాణా, పంపిణీ ఇలా..


● గంజాయి ఘాటైన వాసన గుర్తించకుండా దట్టమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు.

● ప్లాస్టిక్ కవర్లు, అట్టముక్కలలో పెట్టి పైన సుగంధ ద్రవ్యాల వాసన వచ్చే విధంగా సెంట్ చల్లుతున్నారు.

● ఆర్టీసీ బస్సుల్లో తనిఖీ ఉండదని భావించి సూట్‌కేస్‌లలో బ్యాగ్‌ల మధ్యలో పెట్టి రవాణా చేస్తున్నారు.

● గంజాయిని మరిగిస్తూ నూనె తయారు చేస్తున్నారు. భిన్నమైన సీసాల్లో ప్యాక్ చేస్తూ జాగ్రత్త పడుతున్నారు.

పలు ప్రాంతాల నుంచి..: ఉమ్మడి జిల్లాకు రాష్ట్రంలోని పలు పట్టణాలతోపాటు పక్క రాష్ట్రాల నుంచి గంజాయి వస్తోంది. పోలీసులకు పట్టుబడిన కేసులను బట్టి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న గంజాయి ఇలా..



యువతే లక్ష్యంగా : పేద కుటుంబాలకు చెందిన యువతను రవాణా కోసం వినియోగిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలోనూ వారే అధికంగా ఉంటున్నారు. అమ్ముతూ.. లేదా తీసుకుంటూ పట్టుబడిన వారిలో 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసున్న వారే ఉంటుండటం గమనార్హం. ఈ ఏడాది పట్టుబడిన వారిలో ఈ వయసు వారే 72 శాతం ఉంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

■ కరోనాకు ముందు 2019లో నాలుగు జిల్లాల పరిధిలో అధికారికంగా పట్టుబడిన గంజాయి ఏడాది కాలంలో 30-40 కిలోలు ఉండేది. ఇప్పుడు ఏటా క్వింటాలు దాటుతుండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా మన్యం ప్రాంతం నుంచి ఉమ్మడి కరీంనగర్‌కు సరఫరా చేయడం పెరిగింది.

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం:



గంజాయి వల్ల మనిషిలోని పలు అవయవాలు, నాడీ వ్యవస్థపై విపరీతమైన ప్రభావం పడుతుంది. మెదడు మొద్దుబారుతుంది. ఎక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంటుంది. మత్తు వల్ల కళ్లకు విపరీతమైన హాని కలుగుతుంది. ఎర్రబడటంతోపాటు దృష్టిలోపం సమస్య ఎదురవుతుంది. బీపీ ఎక్కువవుతుంది. ఊపిరితిత్తులపైన శ్వాస కోశ నాళాలపైన ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

- డాక్టర్ తిరుపతి, ఫిజిషియన్, కరీంనగర్

కర్ణాటక వసతి గృహాల దుప్పట్లు సిరిసిల్లలో ఉత్పత్తి

మూడు లక్షల మీటర్ల ఆర్డర్లు



గుత్తేదారుకు అప్పగించేందుకు సిద్ధం చేసిన దుప్పట్లు

ఈనాడు, సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల ఖిల్లా సిరిసిల్లకు కర్ణాటక రాష్ట్రంలోని వసతి గృహాలకు అవసరమైన దుప్పట్ల ఆర్డర్లు వస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం విద్యార్థులకు అందించే దుప్పట్ల ఆర్డర్లు పొందిన గుత్తేదారు ఇక్కడి ఆసాములచే ఉత్పత్తి చేయిస్తున్నారు. సిరిసిల్లలోని 68 ఇంచుల మరమగ్గాలున్న పది మంది ఆసాములు ఉత్పత్తి చేస్తున్నారు. నెలకు 40 వేల మీటర్ల చొప్పున మొత్తం మూడు లక్షల మీటర్ల లక్ష్యం. ఉత్పత్తి పూర్తయిన తర్వాత గార్మెంట్ పరిశ్రమలో మహిళలే కుట్టి గుత్తేదారుకు అప్పగిస్తున్నారు. ఒక్కో ఆసామికి ముడిసరకు అందించి మీటరుకు రూ.5 చొప్పున కూలీ మాత్రం చెల్లిస్తున్నారు. నాలుగు మరమగ్గాలు నడిపే ఆసామి ఒక షిఫ్టులో 200 మీటర్లు ఉత్పత్తి చేస్తారు. సగటున ఒక షిఫ్టునకు రూ.వెయ్యి కూలీ గిట్టుబాటు అవుతుంది. అలాగే గార్మెంట్‌పై కుట్టి ఇచ్చే మహిళలకు ఒక దుప్పటికి రూ.5 చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు 50 చొప్పున రూ.250 గిట్టుబాటు అవుతుంది. వీటితో పరిశ్రమలోని ఆయా విభాగాల్లో 200 మంది ఉపాధి పొందుతున్నారు. మొత్తంగా 30 లక్షల మీటర్ల ఆర్డర్లు ఉన్నా ఆసాముల వద్ద పెట్టుబడి లేక తక్కువ మొత్తంలో తీసుకున్నారు. చేనేత, జౌళిశాఖ పెట్టుబడులకు పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇవి ఫలిస్తే భారీ మొత్తంలో మరిన్ని ఆర్డర్లతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వీటితోపాటు ఝార్ఖండ్ ప్రభుత్వం పంపిణీ చేసే చీరల ఆర్డర్లు కూడా ఇప్పుడిప్పుడే పరిశ్రమకు వస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా రెజ్లర్లు

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 కుస్తీ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆటగాళ్లు సత్తా చాటారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.వినయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత పతకాలు, బి.నరసింహా, కె.రాజరథన్, ఎన్.దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ జూనియర్ కళాశాల నుంచి కె.రాజు రజతం, కె.విజయ్ కాంస్య పతకం, వి.రఘు చరణ్ (అల్ఫోర్స్ జూనియర్ కళాశాల) కాంస్య పతకం, సి.హెచ్ ఆదిత్య మహారాజ్ (ట్రినిటీ) కాంస్య పతకం సాధించినట్లు రెజ్లింగ్ టీం కోచ్ ఎం.వంశీ కృష్ణ తెలిపారు. వీరిని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్‌లు అభినందించారు.

రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతి

అభివృద్ధి పనుల బిల్లుల కోసం వెళ్లి వస్తుండగా ఘటన



శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతిచెందిన ఘటన ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, స్థానికుల కథనం ప్రకారం.. బురహాన్‌మియాపేటకు చెందిన గోదాల శ్రీనివాస్‌రెడ్డి (56) గతంలో ఎలిగేడు ప్యాక్స్ ఛైర్మన్‌గా. . తన భార్య మంగ గ్రామ సర్పంచిగా పనిచేశారు. ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లుల కోసం శ్రీనివాస్‌రెడ్డి తన భార్యతో కలిసి మంగళవారం పెద్దపల్లి పీఆర్ డీఈ కార్యాలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో పెద్దపల్లి పట్టణంలో కారు ఢీకొంది. ఆయన తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. మంగ స్వల్ప గాయాలతో చికిత్స పొందారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మరోవైపు శ్రీనివాస్‌రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొని పాడె మోశారు. ఎలిగేడు ప్యాక్ ఛైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సంతోశ్‌రావు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు శ్రీనివాస్‌రెడ్డికి నివాళి అర్పించారు.

నాన్నా.. నీ కల నెరవేర్చా!

న్యూస్‌టుడే, జమ్మికుంట

ఎరువుల దుకాణం నిర్వహించే ఆయనకు రైతుల కష్టసుఖాలు తెలుసు.. అందుకే తన కుమార్తెను బీఎస్సీ (అగ్రికల్చర్) చేయించారు.. నాన్న ఆశయాన్ని అర్థం చేసుకున్న ఆ యువతి కూడా కష్టపడి చదివారు.. ప్రమాదంలో తండ్రి మృతి చెందడం ఆమెను తీవ్ర ఆవేదనలో ముంచినా.. గుండె నిబ్బరం చేసుకున్నారు.. తండ్రి ఆశయ సాధనే తాను ఇచ్చే కానుక అని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు.. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా నియమితులయ్యారు.. తన తండ్రి కల నెరవేర్చానని ఆయన ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలందిస్తానని చెప్పారు.



సింధూజ

ఇల్లందకుంట మండలం సిరిసేడుకు చెందిన గన్ను సింధూజ తండ్రి శ్యాంసుందర్ ఎరువుల దుకాణం నిర్వహించేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తన దుకాణానికి వచ్చే రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ తోచిన సలహాలు ఇచ్చేవారు.. వారి కష్టాలు తీరాలంటే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కీలకం అని గుర్తించిన ఆయన తన కుమార్తె సింధూజను వ్యవసాయ విద్య చదవాలని ప్రోత్సహించారు. మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆమె 2021లో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్) పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. ఓవైపు వ్యవసాయాధికారి కావాలన్న తన తండ్రి ఆశయంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు. ఈ క్రమంలో 2022లో కుమార్తెను ఓ పోటీ పరీక్ష రాయించడానికి తీసుకెళ్తున్న శ్యాంసుందర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. కళ్లెదుటే తండ్రి మరణం ఆమెను తీవ్రంగా కుంగదీసింది. తన తండ్రి కల నెరవేర్చడమే ఆయనకు తానిచ్చే కానుక అని నిర్ణయించుకుని వ్యవసాయాధికారి కావడానికి ఆమె సన్నద్ధమయ్యారు. 2023 మే నెలలో 148 వ్యవసాయాధికారుల పోస్టులకు నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరై 31వ ర్యాంకు సాధించారు. ఈ ఫలితాలు 2024 జూన్‌లో వెల్లడవగా బుధవారం ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా విధుల్లో చేరారు.

రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..

రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్లుగా మారింది ధాన్యం శుభ్రం చేసే యంత్రాల తీరు. గతేడాది యాసంగి సీజన్ పూర్తయ్యాక గంగాధర వ్యవసాయ మార్కెట్‌కు 40 ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు (ప్యాడీ క్లీనర్లు), 8 ఫ్యాన్లు కేటాయించారు. అనంతరం వానాకాలం, యాసంగి సీజన్లలోనూ వీటిని ఉపయోగించలేదు. కేవలం 10 యంత్రాలు మాత్రమే ఆయా గ్రామాలకు పంపించగా, మిగతా 30, 8 ఫ్యాన్లు మార్కెట్ షెడ్డులో వృథాగా పెట్టారు. కేటాయించినా గ్రామాల్లోనూ విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. వీటిని వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. ఒక్కో దానికి రూ.80 వేల చొప్పున రూ.32 లక్షలకు పైగా ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో వీటిని వినియోగించే సదుపాయం లేకపోయినా అప్పటి అధికారులు అమ్యామ్యాల కోసం వీటిని కొన్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం ఈ వానాకాలం సీజన్‌లోనైనా ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గంగాధర



ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించండి

రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం

కరీంనగర్ కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పురపాలికలు, నగర పాలికల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, డిసెంబరులోగా పూర్తి చేయాలని, ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం ఆదేశించారు. బుధవారం ఆయన కరీంనగర్ నగరపాలికలోని కమాండ్ కంట్రోల్ సిస్టం, డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్, స్మార్ట్‌సిటీ కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నళ్లను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ పని విధానాన్ని గురించి మున్సిపల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక వివరించారు. ఉదయం బల్దియా కార్యాలయంలో కరీంనగర్ అధికారులతో, సాయంత్రం ఉమ్మడి జిల్లా పురపాలికల కమిషనర్లు, అధికారులతో వీపీ గౌతమ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతం, డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

■ వాణిజ్య భవనాలకు తనిఖీ చేసి పన్ను మదింపు సక్రమంగా ఉందో లేదో చూడాలన్నారు.

■ మెప్మా ఆధ్వర్యంలో కొత్త సంఘాలను ఏర్పాటు చేయడంలో అశ్రద్ధ వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శక్తి రుణాలలో నూతన సంఘాలను ప్రోత్సహించాలన్నారు.

■ పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకూడదని, పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్‌లో బయోమైనింగ్ పూర్తయ్యే వరకు బిల్లులు చెల్లించకూడదన్నారు. డంపింగ్‌యార్డుకు ప్రత్యామ్నాయంగా స్థల సేకరణ చేయాలని సూచించారు.

జగిత్యాల కమిషనర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

■ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో వెనుకబడిన జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యపై పురపాలక సంచాలకులు వీపీ గౌతం ఆగ్రహించారు. ఎల్‌ఆర్‌ఎస్ లాగిన్ ప్రక్రియ చేయకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమిటని మండిపడ్డారు. సస్పెండ్‌కు ఉత్తర్వులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

■ కుక్కల నియంత్రణ చర్యల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు.

■ 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు. వాహనాలకు మరమ్మతులు చేయాలని, అప్పటివరకు కొత్తవి కొనుగోలు చేయకూడదన్నారు. సమావేశంలో పెద్దపల్లి అదనపు కలెక్టరు అరుణశ్రీ, ఆర్‌డీఎంఏ శాహిద్‌మసూద్, ఆర్‌డీడీటీసీపీ మైకేల్, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, సహాయ కమిషనర్ వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, పక్కన జాతీయాధ్యక్షుడు స్వామి

వెనక్కి వెళ్లిన నిధులు.. రద్దయిన పనులు

ప్రశ్నార్థకంగా ఆలయాల అభివృద్ధి

న్యూస్‌టుడే, ధర్మపురి

భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు పుణ్యక్షేత్రాలను అభివృద్ధిపరచే లక్ష్యంతో గతంలో ప్రతిపాదించిన పనులు సకాలంలో ప్రారంభించకపోవడం, వివిధ కారణాలతో మొదలుపెట్టినా.. నిలిచిపోవడంతో వాటిని ప్రభుత్వం రద్దు చేస్తూ నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల పనులు మళ్లీ ప్రతిపాదించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రధాన దేవస్థానాల వారీగా..

■ వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.60 కోట్లతో వివిధ కాటేజీల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఇతరత్రా పనులు నిలిచిపోయాయి.



ధర్మపురి: నిధులు కేటాయించకపోవడంతో నిలిచిన ధర్మశాల పనులు

■ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.100 కోట్లతో రోప్ వే నిర్మాణ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించగా.. సగం వాటికి సాంకేతిక అనుమతులు వచ్చాయి. ఈలోపు రద్దయ్యాయి.

ఆదేశాలు రాగానే ప్రతిపాదిస్తాం

ప్రభుత్వం మారడంతో ప్రారంభించిన పనులు కొనసాగుతున్నాయి. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ఆదేశాలిస్తే తిరిగి పనులను ప్రతిపాదిస్తాం. వేములవాడ, కొండగట్టు ఆలయాల్లో ప్రతిపాదిత పనులు రద్దయ్యాయి. వీటికి ఇంకా నిధులు కేటాయించలేదు. కేవలం అనుమతులు మాత్రమే వచ్చాయి.

- రఘునందన్, దేవాదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు 30.03.2022న నిధులు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇవన్నీ నూతన ప్రభుత్వం రద్దు చేసింది.

● రూ.5 కోట్లతో చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కొత్త కల్యాణ మండప నిర్మాణం

● రూ.1.80 కోట్లతో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి 3 అంతస్తుల రాజ గోపురం

ధర్మపురిలో రద్దయిన పనుల వివరాలు..

● చింతామణి చెరువులో రూ.50 లక్షలతో వరాహ విగ్రహ ఏర్పాటు

● రూ.20 లక్షల వ్యయంతో శ్రీ సత్యవతి ఆలయ నిర్మాణం ● రూ.16 లక్షలతో యమ ధర్మ రాజు ఆలయ పునర్నిర్మాణం

● నంది కూడలి వద్ద రూ.10 లక్షలతో ఆర్చి గేట్ నిర్మాణం ● రూ.2.20 కోట్లతో 3 రథాలు, రథశాలల నిర్మాణం

● రూ.56.00 లక్షలతో శ్రీ అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు

● రాయపట్నం వద్ద రూ.35 లక్షలతో గరుడ విగ్రహ ఏర్పాటు ● రూ.2.30 కోట్లతో బ్రహ్మపుష్కరిణి, శాలహారం నిర్మాణం ● రూ.2.50 కోట్లతో ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణం ● రూ13 కోట్లతో యోగస్వామి ఆలయ పునర్నిర్మాణం ● రూ.1 కోటి వ్యయంతో మహారాజ గోపురం ● తుమ్మెనాల వద్ద రూ.50 లక్షలతో ఆర్చిగేట్ నిర్మాణం



కోచ్ తిరుపతితో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు

దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ తిరుపతి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో త్రయాథ్లిన్ విభాగంలో జి.నక్షత్ర, బాలికల జావెలిన్ త్రో విభాగంలో సమీరాబేగం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగంలో స్వామి, 5000 మీటర్ల రేస్‌వాక్ విభాగంలో సాయిచరణ్‌రెడ్డి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితోపాటు జిల్లా అథ్లెట్లు ఈ.విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల రేస్ వాక్‌లో, ఎం.వినయ్ 3000 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించి ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రవి తెలిపారు. వీరిని కరీంనగర్ యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, రవికుమార్ అభినందించారు.